## క్లుప్తంగా

### విద్యుత్ వైర్లు తగిలి వ్యక్తికి గాయాలు

**అద్దంకి రూరల్:** విద్యుత్ వైరు కిందకు జారి ఉండటంతో రోడ్డుమీద బైక్ మీద వెళ్తున్న యువకుడికి వైర్లు తగిలి గాయాలయ్యాయి. ఈఘటన ఆదివారం అద్దంకిలో చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. మండలంలోని తిమ్మాయపాలెం గ్రామానికి చెందిన గుర్రం వెంకటరావు అదే గ్రామానికి చెందిన మొద్దు నరసమ్మలు బైకుమీద అద్దంకికి వస్తున్నారు. ఈ క్రమంలో గండ్లకమ్మ బ్రిడ్జి దాటి అద్దంకిలోకి వస్తుండగా రోడ్డుపక్కనే ఉన్న విద్యుత్ స్తంభం వైర్లు ముందుగా వెళ్తున్న పొక్లెయిన్‌కు తగిలి కిందకు జారాయి. వెనుకనే వస్తున్న వెంకటరావుకు తగలటంతో కిందపడ్డాడు. ఈఘటనలో వెంకటరావు గొంతు కోసుకుంది. వెనుక కూర్చున్న నరసమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ సమయంలో కరెంట్ లేకపోవటంతో ప్రమాదం తప్పిందని బంధువులు తెలిపారు.

### పాముల సయ్యాట



సయ్యాటలాడుతున్న పాములు

**అద్దంకి:** మండలంలోని అద్దంకి పట్టణంలోని నాగులపాడు రోడ్‌లోని ఎస్ఈబీ పోలీస్ స్టేషన్ సమీపంలో రెండు పాములు పెనవేసుకుని సయ్యాటలాడాయి. ఈదృశ్యాన్ని స్థానికులు చూస్తున్నా అవి తమకేం పట్టదన్నట్లు ఆటను కొనసాగించాయి. అరుదుగా కనిపించే ఈ దృశ్యాన్ని కొందరు తమ సెల్‌ఫోన్లలో బంధించారు.

### అపార్ట్‌మెంట్ నుంచి కిందపడి..



క్షతగాత్రుడు పరమేశ్వరరెడ్డి

**అద్దంకి రూరల్:** ప్రమాదవశాత్తు అపార్ట్‌మెంట్ నుంచి కాలుజారి కిందపడి ఓ యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ ఘటన ఆదివారం అద్దంకిలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. మండలంలోని శంఖవరప్పాడు గ్రామానికి చెందిన ఏ.పరమేశ్వరరెడ్డి సాఫ్ట్‌వేర్‌గా ఇంటివద్ద నుంచే పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో అద్దంకిలో నివాసం ఉంటున్న బ్రహ్మానందం కాలనీలోని అపార్ట్‌మెంట్‌లోని నాలుగో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. దీంతో కాళ్లు, తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

### పావులూరులో నేత్రదానం



సుబ్బాయమ్మ (ఫైల్)

**ఇంకొల్లు (చినగంజాం):** పావులూరు గ్రామానికి చెందిన గాదె సుబ్బాయమ్మ (75) మరణించడంతో ఆమె నేత్రాలను కుమారుడు అంజిరెడ్డి, కుమార్తె సీతారావమ్మ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి దానం చేశారు. మాజీ సర్పంచ్ పులఖండం భద్రిరెడ్డి ద్వారా దాత కార్నియాలను శంకర్ కంటి వైద్యశాల వైద్యులు సేకరించారు. కుటుంబ సభ్యులకు రోటరీ క్లబ్ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహన్ రావు, జెట్టి వెంకటేశ్వర్లు, క్లబ్ అధ్యక్షుడు కరి కమలేశ్వరరావు, ట్రెజరర్ సాంబశివరావులు అభినందనలు తెలిపారు.

### ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో క్లోరినేషన్

**చీరాల టౌన్:** వర్షాలు కురుస్తున్నాయి.. ప్రజలు అనారోగ్యాలకు గురికాకుండా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలతో పాటుగా ప్రజలకు క్లోరినేషన్ చేసిన మంచినీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని దేవాంగపురి పంచాయతీ కార్యదర్శి మురళీ బాపూజీ అన్నారు. ఆదివారం మండలంలోని దేవాంగపురి గ్రామ పంచాయతీలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకును క్లోరినేషన్ చేయించడంతో పాటుగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను వలంటీర్లతో కలిసి నిర్వహించారు. గ్రామంలోని ప్రదాన వీధుల్లో గ్రామ వలంటీర్లతో కలిసి స్వచ్ఛ భారత్ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

### శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయస్వామి మూలవిరాట్టు

**అద్దంకి:** శోభకృతు నామ సంవత్సరం, ఉత్తరాయణం, అధిక శ్రావణ మాసం ఉత్తర నక్షత్రం పంచమి తిథి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర శనివారం తెలిపారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందెతీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటలవరకుజరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.



గూడ్సు రైలు కిందగా వెళ్లడానికి ప్రయత్నిస్తున్న ప్రయాణికులు



స్లాబు వేయకుండా అసంపూర్తిగా ఉంచిన ఒకటో నెంబరు ప్లాట్‌ఫారం



ఫుట్ ఓవర్ బ్రిడ్జి కోసం తీసి వదిలేసిన గుంత

# తిప్పలు తప్పవు.. దాటక తప్పదు

- కోట్లు ఖర్చుపెట్టి నూతన స్టేషన్ భవన నిర్మాణం
- ఫుట్‌ఓవర్ బ్రిడ్జి లేకపోవడంతో ప్రయాణికుల ఇబ్బందులు
- రైలు దిగాక స్టేషన్‌కి చేరాలంటే పట్టాలు దాటాల్సిందే
- అసంపూర్తిగా పనులు– మౌలిక వసతుల లేమి

**వేటపాలెం:** కేంద్ర ప్రభుత్వం కోట్లు ఖర్చుపెట్టి నూతన స్టేషన్ నిర్మించారు కాని మౌలిక వసతులు కల్పించడంలో విఫలమైంది. రైల్వే ప్రయాణికులు ప్రమాదం అని తెలిసినా పట్టాలు దాటివెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైల్వే శాఖ కోట్లు నిధులు ఖర్చు చేసి వేటపాలెం రైల్వేస్టేషన్ భవనాన్ని నిర్మించారు. అత్యంత రద్దీ అయిన 288 కిలో మీటర్ల విజయవాడ-గూడూరు వరకు మూడోలైన్ కోసం రైల్వే శాఖ రూ.3,246 కోట్లు కేటాయించింది. అందులో భాగంగా వేటపాలెంలో ప్రస్తుతం ఉన్న పాత రైల్వే స్టేషన్ ఉన్న ప్రాంతంలో మూడో లైన్ వస్తున్నందున నూతనంగా రెండస్తుల భవనం నిర్మించి మార్చి 29వ తేదీన ప్రారంభించారు. దీనితో పాటు మరో రెండు ప్లాట్‌ఫారాలు అదనంగా నిర్మించారు. గతంలో రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం మూడు ప్లాట్ ఫారాలు ఉండేవి. మొత్తం ఐదు ప్లాట్‌ఫారాలు ఉన్నాయి.

**వసతుల కరువు..**

రైల్వే స్టేషన్ ఒకటో నెంబర్ ప్లాట్‌ఫారం నుంచి 1,2,3,5 ప్లాట్ ఫారాలకు వెళ్లడానికి ఫుట్‌ఓవర్ బిడ్జి నిర్మాణం చేపట్ట లేదు. వివిధ ప్రాంతాల నుంచి ప్రయాణికులు ప్లాట్ ఫారంపై రైలు దిగిన తరువాత స్టేషన్ బయటికి రావడానికి ప్రమాదమని తెలిసినా పట్టాలు దాటుకుంటూ వస్తున్నారు. స్టేషన్ ప్రారంభించిన నాలుగు నెలల నుంచి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు, దివ్యాంగులు పట్టాలు దాటి రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. కొత్త స్టేషన్ ఏర్పాటు చేశారని ఆనందం కంటే ఫుట్‌ఓవర్ బ్రిడ్జి లేదనే బాధ ఎక్కువగా ఉంది. ఒక్కోసారి ప్లాట్ ఫారంపై గూడ్సు రైళ్లు నిలిపి ఉండటంతో ప్రయాణికులు ప్రమాదమని తెలిసినా గూడ్సు రైలు కిందగా వస్తున్నారు.

**అసంపూర్తిగా ప్లాట్‌ఫారం పనులు..**

నూతనంగా ఏర్పాటు చేసిన రెండు ప్లాట్‌ఫారాలపై ప్రయాణికులు ఎటువంటి వసతులు లేక పోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. కనీసం మరుగుదొడ్ల సౌకర్యం కూడా కల్పించలేదు. ప్లాట్ ఫారాలపై గుంతలు తీసి వదిలేశారు. రాత్రి వేళలో ప్రయాణికులు గుంతలో పడి గాయపడిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఒకటో నంబర్ ప్లాట్ ఫారం పనులు సగం వరకు చేసి మధ్యలోనే అసంపూర్తిగా వదిలేశారు. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు స్పందించి ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.



నూతనంగా నిర్మించిన రైల్వే స్టేషన్ భవనం

# సొసైటీ సేవలు అభినందనీయం



మహాత్మాగాంధీ వెల్ఫేర్ సొసైటీ రుణాలను అందిస్తున్న ఎమ్మెల్యే బలరాం



విద్యార్థులకు క్రికెట్ కిట్ అందిస్తున్న ఎమ్మెల్యే కరణం

- ఎమ్మెల్యే కరణం

**చీరాల:** వస్త్ర వ్యాపారులు వెల్ఫేర్ సొసైటీని ఏర్పాటు చేసి 17 ఏళ్లుగా విద్య, ఉపాధి, సమాజ సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో మహాత్మాగాంధీ వెల్ఫేర్ సొసైటీ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పేద విద్యార్థులకు స్కూల్ ఫీజులు, పుస్తకాలు, పేద మహిళల ఉపాధి కోసం రుణాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వస్త్రవ్యాపారులు, ఆర్యవైశ్యులకు తాము ఎప్పుడు అండగా ఉంటామని, వ్యాపారులు సమాజ సేవా కార్యక్రమాలను ఏళ్లుగా నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. పేద విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలన్నారు. అనంతరం పేద విద్యార్థులు, పేద మహిళకు రుణాలు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రభాకరరావు, మున్సిపల్ కౌన్సిలర్లు మామిడాల రాములు, చీమకుర్తి బాలకృష్ణ, గుంటూరు ప్రభాకరరావు, పొత్తూరి సుబ్బయ్య, ఆర్యవైశ్య నాయకులు చుండూరు రామవిజేత, ఎం.వి.సుబ్బారావు, శ్రీనివాసరావు, లీలాధరరావు, శివ శంకర్ తదితరులు ఉన్నారు.

**ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలి..**

విద్యార్థులు చదువుతో పాటుగా ఆటలు, క్రీడలకు తగిన ప్రాధాన్యతనివ్వాలని ఎమ్మెల్యే కరణం సూచించారు. ఆదివారం చీరాల మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఎస్ఆర్అండ్‌పీఎం హైస్కూల్ క్రీడా మైదానంలో క్రికెట్ ఆడుతున్న చిన్నారులతో ముచ్చటించారు. ఈసందర్భంగా చిన్నారులు తమకు క్రికెట్ కిట్ కావాలని ఎమ్మెల్యేని కోరగా చిన్నారులకు ఎమ్మెల్యే కరణం క్రికెట్ కిట్‌ను అందించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రభాకరరావు, మున్సిపల్ డీఈ ఐసయ్య, కౌన్సిలర్లు బి.అనీల్, కె.వెంకటరావు, బాలకృష్ణ, యానాదిరావు, ప్రభాకరరావు ఉన్నారు.

## దేశమంతా ఒకే గురు పరంపర కొనసాగాలి



ఆలయ పూజారిని సన్మానిస్తున్న విశ్వగురు సేవకులు

**చినగంజాం:** దేశంలోని ప్రజలంతా ఒకే గురు పరంపరలో కొనసాగుతూ ఆరోగ్యం, ఐశ్వర్యం, కుటుంబ ఐక్యత కలిగి సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ ఆదివారం విశ్వగురు సేవకులు కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని పెదగంజాం రామాలయంలో దేశ వ్యాప్తంగా హిందూ ధర్మాన్ని కొనసాగించాలని కోరుతూ హిందూ ధర్మ అభివృద్ధిని కాంక్షిస్తూ కార్యక్రమం నిర్వహించారు. అందరూ హిందూ మతాన్ని విశ్వవ్యాప్తం చేయాలని విశ్వగురు సేవకులు మాచవరపు సుధాకర్ తన ప్రసంగంలో తెలియజేశారు. ముందుగా విశ్వగురు సేవకులు, స్థానిక భక్తులు ఆలయం ప్రాంగణంలో హరే రామ భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వగురు సేవకులు యంపరాల మహాలక్ష్మి, మరుప్రోలు చిన్నబ్రహ్మారెడ్డి, తూమాటి పున్నారావు, కవిత దంపతులు, వాయిల వెంకటేశ్వర్లు, చెంచమ్మ దంపతులు, గుమ్మడి శ్రీలక్ష్మి, గుడి ధర్మకర్త శింగారెడ్డి, భజన సమాజం తదితర సేవకులు పాల్గొన్నారు.

## ఘనంగా బాలగంగాధర్ తిలక్ జయంతి



తిలక్‌కు నివాళులర్పిస్తున్న యువకులు

**చినగంజాం:** స్వరాజ్యం నా జన్మహక్కు అని చాటి చెప్పిన బాలగంగాధర్ తిలక్ జయంతిని మండలంలోని కడవకుదురు గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బాల్యవివాహాలను నిరసిస్తూ, వితంతు వివాహాలను ప్రోత్సహిస్తూ జాతీయ స్ఫూర్తిని రగిలించడానికి నడుంబిగించిన వ్యక్తి అని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో అడుసుమలి హరిబాబు, సందు శ్రీనివాసరావు, అశోకచక్రవర్తి, గాజుల కృష్ణ, గొల్లపూడి వసంతరాయుడు, అనంత యశ్వంత్, గొల్లపూడి లక్ష్మణరావు తదితలురు పాల్గొన్నారు.

# విద్యార్థికి నగదు ప్రోత్సాహం



విద్యార్థిని సత్కరిస్తున్న నిర్వాహకులు

**చీరాల అర్బన్:** పదోతరగతిలో అత్యధిక మార్కులు తెచ్చుకున్న విద్యార్థికి ఆర్థిక సాయం అందించారు. రోటరీ క్లబ్ చీరాల, ఎస్ఆర్‌పీఎం హైస్కూల్ 1992 పూర్వ విద్యార్థులు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో ఎస్ఆర్‌పీఎం హైస్కూల్‌లో కార్యక్రమం అందించారు. పోతినవారిపాలేనికి చెందిన పోతిన రూపేష్ కుమార్ నీట్‌లో 38వ ర్యాంకు సాధించినందుకు రూ.11,116 నగదు, జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు డాక్టర్ పీవీ ప్రసాద్, క్లబ్ అధ్యక్షుడు మామిడాల శ్రీనివాసరావు, చీరాల కృష్ణమూర్తి, దోగుపర్తి వెంకట సురేష్, పోలుదాసు రామకృష్ణ, సర్విశెట్టి సుబ్బరామయ్య, డేగల తిరుపతిరావు, స్వామి, ఆలపాటి రామారావు, రొండా నాగరాజు, పోతర్లంక భిక్షం, వలివేటి మురళీకృష్ణ, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

### నేడు కారంచేడులో స్పందన

**కారంచేడు:** మండల కేంద్రమైన కారంచేడు రెవెన్యూ కార్యాలయ ఆవరణలో సోమవారం ఉదయం ప్రజా సమస్యలపై స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహశీల్దారు ఎస్ వెంకటరత్నం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు స్పందన, మధ్యాహ్నం నుంచి వీఆర్‌ఓల సమావేశం నిర్వహిస్తామన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### నేడు రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష

**బల్లికురవ:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న క్యాంపు సోమవారం మల్లాయపాలెం, వేమవరం సచివాలయాల వద్ద నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సీహెచ్ కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర శాప్ నెట్ ఛైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య ముఖ్య అతిథిగా హాజరవుతారని మండల స్థాయి అధికారులు, లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని అన్నారు.

## వైభవంగా పోలేరమ్మ కొలుపులు



కొలుపుల్లో అమ్మవారి చిత్రపటం

**కారంచేడు:** ప్రతి ఏటా సాగుకు ముందు గ్రామ దేవత పోలేరమ్మ తల్లికి కొలుపులు నిర్వహించడం ఈ గ్రామ ఆనవాయితీ. దీనిలో భాగంగా ఈ ఏడాది వ్యవసాయ పనులు ప్రారంభానికి ముందుగా గ్రామంలోని బందెలదొడ్డి బజారుకు చెందిన కొలుపులను ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి నుంచే గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. చిన్నారుల కోలాటంతో గ్రామంలో పెద్ద ఎత్తున సంబరం నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారికి తలంటు స్నానాలు ఆచరించి, పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం గ్రామ దేవతను ప్రత్యేకంగా అలంకరించిన ప్రత్యేక వాహనంపై ఉంచి ఊరేగించారు. యువతీ, యువకులు వీరతాళ్లతో అమ్మవారి ప్రతిమకు ముందు నృత్యాలు చేశారు.

## సీసీఆర్సీ కార్డులతో కౌలు రైతులకు మేలు



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ పద్మావతి

**జే.పంగులూరు:** కౌలు రైతులను గుర్తించి వారికి వెంటనే కౌలు రైతు గుర్తింపు కార్డులను అందించాలని తహశీల్దార్ ఐ పద్మావతి అన్నారు. మండలంలోని పంగులూరు తహశీల్దార్ కార్యాలయంలో ఆదివారం రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు కౌలు రైతు (సీసీఆర్) గుర్తింపు కార్డులపై అవగాహన కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి మాట్లాడుతూ మండలంలో కౌలు రైతులు 40 నుంచి 50 శాతం మంది ఉన్నారన్నారు. ఇప్పటికే 1500 మందికి కౌలు రైతులకు కార్డులను ఇచ్చామన్నారు. మరో 1500 మందికి కౌలు కార్డులు ఇవ్వాలన్నారు. ఈనెల 30వ తేదీ వరకు కౌలు కార్డులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏలు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

### నేడు పంచాయతీ కార్యదర్శుల సమావేశం

**చీరాల టౌన్:** మండలంలోని అన్నీ గ్రామపంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లతో సోమవారం సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీవో నేతాజీ ఆదివారం తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరయ్యే పంచాయితీ కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లు విధిగా పంచాయతీ, సచివాలయాల సమాచారం, అభివృద్ధి పనుల వివరాలతో విధిగా హాజరుకావాలని ఎంపీడీవో సూచించారు. అలానే మండల తహశీల్దార్ కార్యాలయంలో అన్నీ గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల పరిధిలోని సచివాలయాల వీఆర్వోలతో సమావేశాన్ని నిర్వహిస్తున్నామని తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు తెలిపారు. సమావేశానికి హాజరయ్యే రెవెన్యూ సిబ్బంది పూర్తి సమాచారంతో హాజరుకావాలని తహశీల్దార్ సూచించారు.

# ముస్లింల సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న ఉర్దూ అకాడెమీ డైరక్టర్ బాజీవలి

**సంతమాగులూరు (అద్దంకి):** ముస్లింల సమస్యలను పరిష్కరిస్తామని రాష్ట్ర ఉర్దూ అకాడెమీ డైరెక్టర్ బాజీవలి అన్నారు. ఆదివారం ' హర్ దిల్ మే వైఎస్సార్– హం సబ్ జగన్‌కే సాత్' కార్యక్రమంలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లోని మసీదులను సందర్శించారు. ఆయా మసీదుల్లోని సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాజీవలి మాట్లాడుతూ ముస్లింల కోసం నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి రిజర్వేషన్లు కల్పిస్తే, నేడు ఆయన తనయుడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి మరో రెండగులు వేసి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. దానికి ప్రతిగా రాబోయో రోజుల్లో మరలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చే విధంగా అందరూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంఘ అధ్యక్షుడు నజీర్‌అహ్మద్, బాపట్ల జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ ఇమామ్ హుస్సేన్, సెక్రటరీ గడ్డం మస్తాన్ వలి, నాయకులు షేక్ ఫరీద్, ఖాసీం సైదా, రెహమాన్, ఇమాంలు, మౌజన్‌లు, మసీదు పెద్దలు పాల్గొన్నారు.

### 1339 గ్రూపులకు సున్నా వడ్డీ

**బల్లికురవ:** ప్రభుత్వం పొదుపు గ్రూపు మహిళలకు నాలుగో విడత సున్నా వడ్డీ కింద 1339 గ్రూపులు అర్హత పొందాయని వైఎస్సార్ కేపీ ఏపీఎం బీ.సురేంద్రబాబు ఆదివారం ఒక ప్రటనలో తెలిపారు. త్వరలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామాల వారీగా పొదుపు గ్రూపు మహిళల ఖాతాకు సొమ్ము జమ చేస్తారని వివరించారు.

### రోటరీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



కార్యక్రమంలో మాట్లాడుతున్న శివన్నారాయణ

**చీరాల అర్బన్:** రోటరీ క్లబ్ ఆఫ్ క్షీరపురి నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక రోటరీ కమ్యూనిటి హాలులో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా క్లబ్ పీడీజీ శివన్నారాయణ హాజరయ్యారు. క్లబ్ 2023–24 నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా నన్నపనేని రామకృష్ణ, కార్యదర్శిగా బాచిన నాగమల్లేశ్వరరావు, ట్రెజరర్‌గా మువ్వల వంశీకృష్ణలచే ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ సురేష్, బండారుపల్లి హేమంత్‌కుమార్, అడ్డగడ మల్లికార్జునరావు, పుల్లెల సుబ్రహ్మణ్యేశ్వరరావు, రావి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

### 26న ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిూస్ యూనియన్ సదస్సు

**అద్దంకి రూరల్:** యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిూస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 26న విజయవాడలో నిర్వహించనున్న సదస్సు విజయవంతం చేయాలని డివిజన్ కార్యదర్శి వైవీ ఎస్ నరేష్ కోరారు. ఆదివారం స్థానికి సుందరయ్య భవన్‌లో సదస్సు వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల రెగ్యులేషన్‌తో ఉద్యోగ భద్రత పలు విషయాలను సదస్సులో చర్చిస్తారన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సుబ్బారావు, తంగిరాల వెంకటేశ్వర్లు, తొట్టెంపూడి శ్రీను, సాంబశివరావు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.